సాక్షి
నంద్యాల
మంగళవారం, 20, మే, 2025



94.04 శాతం హాజరు
ఏపీ ఈఏపీ సెట్ సోమవారం ప్రారంభం కాగా 94.04 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 8లో▸



లక్ష్మమ్మవ్వ.. పాహిమాం
ఆదోని టౌన్: పట్టణంలో సోమవారం మహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం కనుల పండువగా సాగింది. 'లక్ష్మమ్మవ్వ.. పాహిమాం' అంటూ ప్రజలు అవ్వవారిని దర్శించుకున్నారు.



సమ్మర్‌లో సరదాగా!
వేసవిలో చిన్నారుల సేవలో నిమగ్నమవుతూ వస్తోంది కళారాధన సాంస్కృతిక సంస్థ. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తోంది.
8లో▸

ఆశలు వర్షిస్తూ.. విత్తు వణికిస్తూ!

విత్తన పంపిణీలో అంతులేని నిర్లక్ష్యం

- వర్షాలు కురుస్తున్నా స్పందించని ప్రభుత్వం
- బకాయిలు చెల్లిస్తేనే విత్తన సరఫరా అంటున్న కంపెనీలు
- ఇప్పటి వరకు మొదలుకాని ప్రాసెసింగ్ ప్రక్రియ
- గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో మే 15 నుంచే పంపిణీ
- ఇప్పుడు అరకొర కేటాయింపులతో సరి
- వర్షాలు కురుస్తుండటంతో దిక్కుతోచని రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ మంచుకొస్తోంది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ విత్తనం అందుబాటులో లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారుతోంది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మే నెల 15 నుంచే విత్తన పంపిణీ జరిగింది. వర్షాలు పడిన వెంటనే విత్తనాల కోసం ఎదురు చూడకుండా సకాలంలో విత్తుకునే అవకాశాన్ని కల్పించింది. 2024 ఖరీఫ్ సీజన్ సమయంలో కూడా అప్పటి ప్రభుత్వం ముందస్తు చర్యల వల్ల సకాలంలో విత్తన పంపిణీ సాధ్యమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పూర్తి స్థాయిలో విత్తన పంపిణీపై దృష్టి సారించని పరిస్థితి. సబ్సిడీ పంపిణీలో వేరుశనగ, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు ప్రధానమైనవి. ఈ విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ సరఫరాకు కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచి రేట్లు ఖరారు చేసినప్పటికీ సంబంధిత కంపెనీలు విత్తన సరఫరాకు సిద్ధంగా లేవని తెలుస్తోంది. ఇంతవరకు ప్రాసెసింగ్ ప్రక్రియనే మొదలు పెట్టలేదంటే పంపిణీ ఎలా సాధ్యమనే ప్రశ్న తలెత్తుతోంది. దీంతో రైతులు వేరుశనగ విత్తనం కాయల కోసం వ్యాపారులను ఆశ్రయించక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2024–25 బకాయిలు చెల్లిస్తేనే విత్తన సరఫరా

రాష్ట్రం మొత్తం మీద ఏపీ సీడ్స్‌కు విత్తనాలు సరఫరా చేసే కంపెనీలు 45 వరకు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 3 కంపెనీలు సరఫరా చేయాల్సి ఉంది. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, రబీ సమయంలో సరఫరా చేసిన శనగ(బెంగాల్‌గ్రామ్), ఇతర విత్తనాలకు ఏపీ సీడ్స్ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. సబ్సిడీ మొత్తం ప్రభుత్వం నుంచి ఏపీ సీడ్స్‌కు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం ఏపీసీడ్స్‌కు ఒక్క రూపాయి కూడా విదిల్చకపోవడం వల్ల సరఫరా చేసిన కంపెనీలకు నగదు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. బకాయిలు చెల్లిస్తేనే విత్తనాలు సరఫరా చేస్తామంటూ కంపెనీలు భీష్మించాయి.



కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విత్తనాలు లేక ఖాళీగా ఏపీ సీడ్స్ గోదాములు

విత్తనాల కోసం రైతులకు తప్పని తిప్పలు

ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా విత్తన పంపిణీ విషయంలో కూటమి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ సారి సబ్సిడీ విత్తన పంపిణీ విషయమై కూటమి ప్రభుత్వం చేతులెత్తేసే అవకాశం ఉండటంతో రైతులు విత్తనాల కోసం దిక్కులు చూస్తున్నారు. ఇప్పటి వరకు వేరుశనగ క్వింటా ధర రూ.6,500 ఉండగా.. వ్యాపారులు ఉన్నట్లుండి ధరను పెంచేశారు. ఈ సారి విత్తనాల పంపిణీ దిశగా ప్రభుత్వ చర్యలు లేకపోవడం వ్యాపారులకు కలసి వస్తోంది. ధరలను అడ్డగోలుగా పెంచి దోపిడికి పాల్పడే ప్రమాదం ఏర్పడింది.

పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు సమస్య

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వరి సాగు ఎక్కువగా ఉన్నందున పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు డిమాండ్ ఉంది. నంద్యాల జిల్లాలో వరి ప్రధాన పంట. కర్నూలు జిల్లాలో కూడా వరి సాగవుతోంది. వరి నాట్లకు ముందు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, సన్‌హెంప్ విత్తనాలు విత్తుకొని 45 రోజుల సమయంలో దున్ని పొలంలో కలిపేస్తారు. ఇందువల్ల భూమికి అన్ని పోషకాలు కలిగిన ఎరువులు లభిస్తాయి. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు జిల్లాకు కనీసం 3,500 క్వింటాళ్లు అవసరం. అయితే ఏపీ సీడ్స్ వద్ద కేవలం 1000 క్వింటాళ్లు మాత్రమే ఉన్నాయి. కంపెనీలు విత్తన సరఫరా చేయడంలో చేతులెత్తేశాయి. ఇప్పటికే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల కోసం రైతులు వ్యవసాయ అధికారులు, ఏపీ సీడ్స్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో విత్తనాలను అందుబాటులో పెట్టకపోతే రైతులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొంది.

అరకొరగా విత్తన కేటాయింపులు

- ఖరీఫ్‌లో వేరుశనగ ప్రధాన పంట. కర్నూలు జిల్లాలో 54,170 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 11,943 హెక్టార్ల వరకు సాగయ్యే అవకాశం ఉంది.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేపట్టేందుకు 32,181 క్వింటాళ్ల విత్తన కాయలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు.
- ఆయా జిల్లాల అధికారులు వినతిని కూటమి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.
- ఉమ్మడి జిల్లాకు తూతూమంత్రంగా 11,108 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది.
- సాధారణంగా గత ఏడాది ఏఏ విత్తనం ఏ మేర పంపిణీ అయిందో దానికి అనుగుణంగా విత్తనాలను కేటాయిస్తారు.
- గత ఏడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాకు 14,395 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 3,062.7 క్వింటాళ్ల ప్రకారం విత్తన పంపిణీ జరిగింది.
- కనీసం ఈ ప్రకారమైన కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు కరువయ్యాయి.



- కర్నూలు జిల్లాకు 9,099, నంద్యాల జిల్లాకు 2,009 క్వింటాళ్లతో సరిపెట్టడం గమనార్హం.
- ఈ కేటాయింపులు చూసి అధికారులు పంపిణీ ఎలా చేపట్టాలోనని తలలు పట్టుకుంటున్నారు.

2020 నుంచి ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంపిణీ

సంవత్సరం	పంపిణీ చేసిన వేరుశనగ (క్వింటాళ్లలో)
2020	41,772.60
2021	23,725.50
2022	16,106.70
2023	18,680.70
2024	17,457.50
2025 కేటాయింపు	11,108.00

బ్లాక్‌లో కొనాల్సి వస్తుందేమో



ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తాం. గత ఏడాది వరకు మే 15 నుంచే వేరుశనగ సహా అన్ని రకాల విత్తనాల పంపిణీ చేశారు. ముందస్తుగా విత్తనాలు సిద్ధం కావడంతో వర్షాలు కురిసిన వెంటనే సకాలంలో విత్తుకు అవకాశం ఉండేది. ఈ సారి సబ్సిడీపై విత్తనాల పంపిణీ జరుగుతుందో, లేదో తెలియని పరిస్థితి. ఇప్పటికీ వర్షాలు కురుస్తున్నాయి. విత్తనాల కోసం దిక్కుతు చూడాల్సి వస్తోంది. మరో నాలుగైదు రోజుల్లో విత్తనాలు అందుబాటులోకి రాకపోతే బ్లాక్‌లో కొనాల్సిందే.

– సత్యప్ప, మామిళ్లకుంట, తుగ్గలి మండలం

ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియదు



13 ఎకరాల్లో వరి, వేరుశనగ 8 ఎకరాల్లో సాగు చేస్తున్నాం. మామూలుగా అయితే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు వినియోగించం. మొదటిసారిగా వరి నాట్లకు ముందు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు విత్తుకోవాలనుకున్నాం. కానీ వ్యవసాయ శాఖ ఇంతవరకు విత్తనాల పంపిణీ చేపట్టలేదు. కేటాయింపులు అరకొరగా ఉన్నాయి. ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో చెప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితిని మొదటిసారి చూస్తున్నాం.

– కెంచప్ప, గజ్జిహళ్లి, హొళగొంద మండలం

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

బొమ్మలసత్రం: జిల్లాలో నేరాల నియంత్రణకు ముఖ్యమైన ప్రాంతాల్లో సోమవారం కార్డెన్ సెర్చ్ జరిపామని ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని పాములపాడు, ఇస్కాల, మండ్లెం, ఆళ్లగడ్డ పరిధిలోని చింతకుంట గ్రామాల్లో వేకువజామున సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ధ్రువపత్రాలు లేని 44 వాహనాలు, అక్రమంగా నిల్వ ఉంచిన 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లు, పలు అనుమానితుల ఇళ్లను సోదాలు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలకు నేరాల పట్ల అవగాహన కల్పించామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో సీఐలు సురేష్‌కుమార్ రెడ్డి, యుగంధర్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలోని 35 సెంటర్లలో ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈఓ జనార్దన్ రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 1,231 మంది గాను 729 మంది విద్యార్థులు హాజరు కాగా 502 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, 15 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి హిందీ పరీక్ష నాలుగు కేంద్రాల్లో నిర్వహించగా 16 మంది విద్యార్థులకు గాను 12 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇంటర్ హిందీ పరీక్షకు రెండు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించగా 68 మందికి గాను 56 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు డీఈఓ తెలిపారు.

డీసీహెచ్‌ఎస్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన డీసీహెచ్‌ఎస్ లలితకు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

గోస్పాడు: జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త(డీసీహెచ్‌ఎస్)గా డాక్టర్ ఓ లలిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సివిల్ సర్జన్ ఆర్థోపెడిక్ డాక్టర్ జఫరుల్లాను ఉన్నతాధికారులు ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. ఆ స్థానంలో బనగానపల్లె ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం సివిల్ సర్జన్ డాక్టర్ ఓ లలితను ఇక్కడికి బదిలీ చేయడంతో ఆమె విధుల్లో చేరారు.

ఐఎఫ్‌ఎస్‌కు డీటీఓ ఐశ్వర్యారెడ్డి ఎంపిక



సాక్షి, నంద్యాల: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించిన ఐఎఫ్ఎస్ 2024 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. యూపీఎస్సీ గత ఏడాది నవంబర్, డిసెంబర్ మెయిన్ పరీక్షలు నిర్వహించింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పర్సనాలిటీ టెస్ట్ నిర్వహించి తుది ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. దేశ వ్యాప్తంగా 143 మంది అభ్యర్థులు ఐఎఫ్ఎస్ సర్వీసులకు ఎంపికయ్యారు. అందులో డీటీఓ ఐశ్వర్యారెడ్డి 13వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఐశ్వర్యారెడ్డి ఏడు నెలల క్రితం జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ఐశ్వర్యారెడ్డి ఎంపికపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం కోసం ధర్నా

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 19 రోజులు గడిచినప్పటికీ రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో ఎమ్మిగనూరు పట్టణం లక్ష్మీపేట వాసులు సోమవారం ధర్నా చేశారు. ప్రతి నెలా మొదటి వారంలోనే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో తాము పస్తులుండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేసుకొని బతికే తమకు రేషన్ బియ్యం పంపిణీ చేయకుంటే ఎలా అని లక్ష్మి, నర్సమ్మ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలైన తమకు సత్వరం రేషన్ బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

మేమింతే!


- మెమో జారీ చేసినా తీరు మార్చుకోని సచివాలయ ఉద్యోగులు
- విధులకు ఇలా వచ్చి అలా వెళ్తున్న వైనం

జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండా ఎక్కడి సమస్యలకు అక్కడి పరిష్కారం లభించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చింది. ఒక్కో సచివాలయానికి దాదాపు 20 మంది ఉద్యోగులను కేటాయించి ప్రతి సమస్యకూ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు సచివాలయాలను గాలికొదిలేశారు. వారి పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడి ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఇక ముత్యాలపాడు సచివాలయం–1 పరిస్థితి మరింత దారుణం. ఇక్కడి ఉద్యోగులు మెరుపు తీగలను తలపిస్తున్నారు. ఇలా వచ్చి ఫేస్ యాప్‌లో హాజరు వేసుకుని అలా మాయమవుతున్నారు. కనీసం అర గంట కూడా కుర్చీలలో కూర్చోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలు కళ్లు కాయలు కాసేలా వేచి చూడటం.. తిరిగి ఇళ్లకు వెళ్లడం పరిపాటిగా మారింది. విసుగు చెంది వారం క్రితం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేయగా ఆయన మెమో ఇచ్చి చేతులు దులిపేసుకోవడం తప్ప చర్యలు తీసుకోలేదు. ఇదే అలుసుగా తీసుకున్న సచివాలయ ఉద్యోగులు సోమవారం కూడా యథావిధిగా విధులకు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన ప్రజలు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

– చాగలమర్రి



సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్న దృశ్యం



ఇటీవల జారీ చేసిన మెమో

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 213 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి పంపారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. స్వీకరించిన ప్రతి అర్జీకి కచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. 49 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని, వీటన్నింటినీ తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 62 వీఐపీ అర్జీలను కూడా త్వరగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయ సేకరణ 43.15 శాతం మాత్రమే జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న డేటాను త్వరితగతిన సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా మన మిత్ర క్యాంపెయిన్‌కు సంబంధించి ఇంకా 13,724 పెండింగ్ ఉందని, వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించి 2,367 పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. మిస్సింగ్ సిటిజన్స్‌కు సంబంధించి 712, సిటిజన్ ఈకేవైసీ 2,34,772 మందికి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొగాకును కొనుగోలు చేయాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): రైతులు పండించిన పొగాకు దిగుబడులను కంపెనీలు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. పొగాకు కొనుగోలు చేసేలా కంపెనీలతో అధికారులు చర్చలు జరపాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన పొగాకును ఒప్పందం మేరకు కంపెనీలు తక్షణమే కొనుగోలు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యత లోపం పేరుతో పొగాకు బేళ్లను వెనక్కు పంపకుండా ఒప్పందం మేరకు పండించిన దిగుబడులను క్వింటా రూ.18,500తో కొనుగోలు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. కంపెనీలతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సభ్యులు ప్రసాద్, నరసయ్య, రైతులు రఘురామిరెడ్డి, నారాయణ, వెంకటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండేలా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమ అనంతరం అధిక వర్షాల పట్ల అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. ఈదర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు అందులో ఉన్న సిబ్బంది పేరు, ఫోన్ నంబరుతో సహా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉన్న వారిని వీఆర్ఓల ద్వారా అప్రమత్తం చేయాలన్నారు. కుందూ నది పరీవాహక ప్రాంతాల ప్రజలను కూడా అప్రమత్తం చేయాలన్నారు.

ముట్టడికి తరలిరండి



సంఘీభావం తెలుపుతున్న ఐక్య ఉపాధ్యాయ సంఘాలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 21న ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయం, 23న విజయవాడలోని విద్యాభవన్ ముట్టడి కార్యక్రమాలకు ఉపాధ్యాయులు తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు సాంబశివుడు, రామపక్కీర్‌రెడ్డి, మహమ్మద్ కాశీం, రామచంద్రారెడ్డి, అబ్దుల్‌అజీజ్, వెంకటరమణ కోరారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయ ఆవరణంలో ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల పునర్వ్యవస్థీకరణ, క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జారీ చేసిన 19, 20, 21 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, జీఓ నెం.117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ముట్టడి కార్యక్రమాలకు ప్రతి ఉపాధ్యాయుడు తరలిరావాలన్నారు. సమావేశంలో ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు భాస్కరరెడ్డి, కృష్ణారావు, మౌలాలి, సుబ్బయ్య, కృష్ణార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మున్సిపల్ విభాగంలో జిల్లా నాయకులు

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగంలో పలువురు జిల్లా నాయకులకు చోటు దక్కింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టినట్లు కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర మున్సిపల్ వింగ్ సెక్రటరీగా మారుబోతుల విజయ్‌కుమార్ (శ్రీశైలం నియోజకవర్గం), జాయింట్ సెక్రటరీలుగా బొల్లవరం సురేంద్ర పద్మనాభరెడ్డి (ఆళ్లగడ్డ నియోజకవర్గం), ఎస్ఎమ్‌డీ జాకీర్ హుస్సేన్ (డోన్ నియోజకవర్గం) నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర దివ్యాంగుల విభాగం కార్యదర్శిగా ఎస్ విజయ్‌కుమార్ (పాణ్యం నియోజకవర్గం) నుంచి నియమించారు.

సిపెట్ డిప్లమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల డిప్లమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్‌కు ఈనెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంటుందన్నారు. జూన్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా 150 సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్లాస్టిక్ రంగంలోని బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 83093 98357 సంప్రదించాలన్నారు.

జిల్లాను వదలని వర్షాలు

నంద్యాల(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాను వర్షాలు వదలడం లేదు. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రైతులు లోదుక్కులు దున్నుకునేందుకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతోంది. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో కల్లాల్లో ఆరబోసిన మిరప, వరి దిగుబడులను రైతులు ఇళ్లలోకి చేర్చుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో 92.6 మి.మీ వర్షం కురిసింది. అందులో గడివేముల మండలంలో అత్యధికంగా 38.4 మి.మీ, అత్యల్పంగా కోవెలకుంట్ల మండలంలో 0.2 మి.మీ వర్షం కురిసింది. జూపాడుబంగ్లాలో 11.2, డోన్ 9.4, ఆత్మకూరులో 9.4, ప్యాపిలి 8.2, మిడుతూరు 4.2, నందికొట్కూరు 3.2, ఉయ్యాలవాడ 1.6, ఆళ్లగడ్డ 1.4, వెలుగోడు 0.6 మి.మీ వర్షం కురిసింది.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు.. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.



ఆధునిక డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు



కోలాటం నేర్చుకుంటున్న చిన్నారులు

సమ్మర్‌లో సరదాగా!

- 'కళారాధన' ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు
- 25 ఏళ్లుగా పేద విద్యార్థులకు బాసటగా కళారాధన

సమ్మర్ స్పెషల్

ఒకటి రెండు కాదు ఏకంగా 25 ఏళ్లుగా ఏటా వేసవిలో చిన్నారుల సేవలో నిమగ్నమవుతూ వస్తోంది కళారాధన సాంస్కృతిక సంస్థ. సేవే లక్ష్యంగా ఏర్పడిన ఈ సంస్థ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తోంది. ఆటపాటలతో పాటు క్రీడలు, లలిత కళల్లోనూ రాణించేలా తర్ఫీదునిస్తోంది. ఈ ఏడాది దాదాపు 600 మందికి విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతోంది. నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వేసవి లలిత కళల శిక్షణా శిబిరం జోరుగా, హుషారుగా సాగుతోంది.

నంద్యాల(వ్యవసాయం): లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, ఐఎంఏ సహకారంతో 2000 సంవత్సరంలో కళారాధన సంస్థను స్థాపించి అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రవికృష్ణ నియమితులయ్యారు. అప్పటి నుంచి ఏటా మే నెలలో వేసవి లలిత కళల శిక్షణా శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. మొదట్లో రామకృష్ణ విద్యాలయంలో జరిగే వేసవి శిబిరాన్ని 2012లో నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌కు మార్చారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచి సృజనకు పదును పెట్టేందుకు కళారాధన సంస్థ వినూత్న కార్యక్రమాలను చేపడుతూ వస్తోంది. పలు సంస్థలు, వైద్యులు, ఉద్యోగుల సహకారంతో ఎంతో మందికి ఉచిత శిక్షణ అందిస్తూ కళారాధన తన ప్రత్యేకతను చాటుకుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కొందరు ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో డ్యాన్స్ మాస్టర్లుగా, కోచ్‌లుగా రాణిస్తున్నారు.



తైక్వాండో శిక్షణ పొందుతున్న చిన్నారులు

వివిధ రంగాల్లో శిక్షణ

చదరంగం, ఆధునిక, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, శారీ పెయింటింగ్, తైక్వాండో, శాస్త్రీయ సంగీతం, మిమిక్రీ, వాయిద్య సంగీతం, భగవద్గీత, తెలుగు పద్యాలు, కీబోర్డు, కబడ్డీ, కర్రసాము, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర లలిత కళల్లో శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 22 మంది కోచ్‌లు ఎలాంటి ఫీజు తీసుకోకుండా శిక్షణ ఇస్తున్నారు.



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జూన్‌లో ప్రదర్శన

ఈ వేసవి లలిత కళల శిక్షణా శిబిరం జూన్ మొదటి వారంలో ముగుస్తుంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి జూన్ మొదటి వారంలో టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఈ శిబిరానికి ఏటా ఆదరణ పెరుగుతోంది.

ఏటా పెరుగుతున్న ఆదరణ



పేద విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, విజ్ఞానాన్ని వెలికితీయడం కోసమే కళారాధన సంస్థ ఉచితంగా పని చేస్తోంది. మెరుగైన సేవలను అందిస్తుండటంతో ఏటా చిన్నారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. శిబిరంలో శిక్షణ పొందినంత మాత్రాన పూర్తిగా రాదు. కానీ చిన్నారుల్లో ఆసక్తి, సృజనాత్మకత, విజ్ఞానం పెంచడమే మా లక్ష్యం.

– డాక్టర్ రవికృష్ణ, కళారాధన ప్రధాన కార్యదర్శి



చెస్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

నేర్పిస్తున్నందుకు తృప్తిగా ఉంది



16 ఏళ్ల నుంచి ఆధునిక నృత్యంలో శిక్షణ ఇస్తున్నాను. ఈ శిబిరంలో శిక్షణ పొందిన వారు కొందరు డ్యాన్స్ అకాడమీలను స్థాపించుకున్నారు. మరికొందరు ప్రైవేటు విద్యాసంస్థల్లో డ్యాన్స్ మాస్టర్లుగా ఉపాధి పొందుతున్నారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో తృప్తిగా ఉంది.

– రాజాహుసేన్, డ్యాన్స్ మాస్టర్

నృత్యం నేర్చుకుంటున్నా



ఆరేళ్ల నుంచి వేసవిలో నృత్యం నేర్చుకుంటున్నాను. ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదు. బాగా నేర్పుతున్నారు. జూన్‌లో ప్రదర్శన ఇచ్చే అవకాశం ఉంటుందంటా. అందుకే బాగా నేర్చుకుంటున్నాను.

– గోవర్ధిని, శిక్షణ పొందుతున్న విద్యార్థిని

భవిష్యత్తులోనూ నేర్పిస్తా



ఎక్కువ మంది చిన్నారులు ఆధునిక నృత్యంపైనే ఆసక్తి చూపుతున్నారు. నాలుగైదేళ్ల చిన్నారులు కూడా హుషారుగా, ఎంతో జోష్‌తో పాల్గొంటున్నారు. ఫీజు లేకపోయినా సరే చిన్నారులకు నేర్పుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. కాబట్టి ముందు ముందు కూడా చిన్నారులకు డ్యాన్స్ నేర్పిస్తా.

– డాక్టర్ లలితాసరస్వతి, భరతనాట్యం డ్యాన్స్ మాస్టర్



విద్యార్థులకు పెయింటింగ్ నేర్పిస్తున్న కోచ్ గణేష్



డ్రాయింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు



బండిఆత్మకూరు సమీపంలోని కుందూ నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

కుందూలో ఇసుక తోడేళ్లు

ఇదో ఇక్కడ రాత్రీపగలు కష్టపడి అత్యవసరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లుంది కదూ. అదేం కాదు. బండిఆత్మకూరు మండల కేంద్రం సమీపంలోని కుందూ నదిలో ఇసుక తోడేళ్లు పడ్డాయి. జేసీబీలతో ఇసుకను తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాయి. నదిలో నిత్యం ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్న తోడేళ్లు కూటమి నేతలేనని తెలిసి చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. – ఆత్మకూరు



రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

వాల్మీకి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: ఎమ్మిగనూరులో నిర్వహించిన కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తామని, వారు భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగేలా చూస్తామన్నారు. వాల్మీకి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి వారు అభివృద్ధి వైపు నడిచేలా చూస్తామన్నారు. గౌరవాధ్యక్షులుగా కర్నూలుకు చెందిన టి.బాలవెంకటేశ్వర్లు (రిటైర్డ్ ఉద్యోగి), అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన బి.మల్లన్న, (ఏడీ, వెటర్నరీశాఖ), ప్రధాన కార్యదర్శిగా ఆదోనికి చెందిన బి.సుధాకర్‌బాబు (ఉపాధ్యాయుడు), కోశాధికారిగా కోసిగికి చెందిన ఎస్.వెంకటరెడ్డి (ఉపాధ్యాయుడు), ఇతర సలహాదారులు, ఉపాధ్యక్షులు, అదనపు కార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. వాల్మీకి ఉద్యోగ సంఘం గౌరవ సలహాదారుడు వెంకన్న, ఉపాధ్యక్షుడు హుసేని, ఇతర నాయకులు పులుసు నారాయణ, తిమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, రఘునాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 94.04 శాతం హాజరు

- సమయానికి చేరుకోలేక వెనుదిరిగిన ఇద్దరు విద్యార్థులు



విద్యార్థినుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ఏపీ ఈఏపీ సెట్ సోమవారం ప్రారంభం కాగా 94.04 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో మూడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 3,190 మందికి గాను 3,000 మంది (94.04 శాతం) హాజరయ్యారు. కర్నూలు నగరంలో 7 కేంద్రాలు, ఎమ్మిగనూరు, ఆదోనిలలో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో ఉదయం సెషన్ పరీక్షకు 1,597 మందికిగాను 1,492 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన పరీక్షకు 1,593 మందికిగాను 1,508 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లాలో 3 కేంద్రాలలో ఉదయం సెషన్‌లో 713 మందికి 659 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 711 మందికిగాను 659 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కర్నూలు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు.

వడ్ల వ్యాపారిపై కేసు నమోదు



కడప జిల్లా కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరుతో సృష్టించిన నకిలీ బిల్లు రశీదు

అవుకు: నకిలీ రశీదులు సృష్టించి లారీలను చెక్‌పోస్టులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్న వడ్ల వ్యాపారిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తెలిపిన వివరాలు.. అవుకు పట్టణానికి చెందిన వడ్ల వ్యాపారి సాయి ఈనెల 5న రాత్రి 10 గంటలకు వరి బస్తాల లోడ్ లారీని అవుకు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బేతంచెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద మార్కెట్ కమిటీ అసిస్టెంట్ తనిఖీ చేశారు. కడప జిల్లా కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి బిల్లు చెల్లించినట్లు ఉన్న రశీదులను లారీ డ్రైవర్ చూపించాడు. అసిస్టెంట్‌కు రశీదులపై అనుమానం వచ్చింది. లారీ డ్రైవర్ మార్కెట్ కమిటీ అసిస్టెంట్‌కు సుపరిచితుడు కావడంతో విషయాన్ని ఆరా తీశారు. దీంతో నకిలీ రశీదులని తెలియడంతో వెంటనే అధికారులకు సమాచారమిచ్చారు. బిల్లులు ఎవరిచ్చారని డ్రైవర్‌ను విచారించగా అవుకు గ్రామానికి చెందిన వడ్ల వ్యాపారి సాయి ఇచ్చినట్లు చెప్పడంతో బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీంతో సాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

బొమ్మలసత్రం: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అడిషనల్ ఎస్పీకి 67 వినతులను అందించారు. కొన్ని సమస్యలను ఆయన ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అన్నదమ్ముల ఆస్తి తగాదాలు, అత్తింటి వేధింపులు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను త్వరగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ జయరాముడు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



చరణ్ (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని ఎస్ రంగాపురంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామాంజనేయులు, సునీతల కుమారుడు చరణ్ (10) సోమవారం ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదివిన చరణ్.. వేసవి సెలవులు కావడంతో తోటి మిత్రులతో కలసి ప్రతిరోజూ గ్రామ శివారులోని కుంటలో ఈత నేర్చుకునేవాడు. రోజులాగే సోమవారం కూడా ఈతకు వెళ్లాడు. నీటిలో మునిగిపోకుండా వీపునకు ప్లాస్టిక్ డబ్బా కట్టుకుని కాసేపు ఈత కొట్టాడు. తర్వాత ప్లాస్టిక్ డబ్బా తొలగించి కుంటలోకి దూకి బయటకు రాలేకపోయాడు. కొద్ది సేపటి తర్వాత అదే కుంటలో ఈత కొడుతున్న కొందరు అడుగున తమకు ఏదో తగులుతోందని గుర్తించారు. వెంటనే అందరూ కలిసి అడుగున ఉన్న చరణ్‌ను బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బాలుడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండాలో ఏడేళ్ల చిన్నారిపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిన్నారి ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన హరీష్ నాయక్ మాయమాటలు చెప్పి తన ఇంటి పైకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. చిన్నారి కేకలు వేస్తూ తప్పించుకుని వచ్చి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దేవనకొండ: అప్పుల బాధతో దేవనకొండకు చెందిన గిడ్డిగారి ప్రకాష్(48) అనే రైతు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న మూడు ఎకరాల పొలంలో పంటలు పండిస్తూనే సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రకాష్ జీవనం సాగించేవాడు. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండలేదు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి దాదాపు రూ.15 లక్షలు దాకా అప్పులపాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక నిత్యం సతమతమవుతూ ఉండేవాడు. భార్య పిల్లలు బంధువుల శుభకార్యానికి వెళ్లగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా శవమై వేలాడుతున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చారు. పోలీసులు వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.